న్యూస్‌రీల్

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ బాలురు గురుకుల జూనియర్ కళాశాల 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూప్‌లలో ప్రవేశం కోసం దరఖాస్తులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ మలోత్ తిరుపతి నాయక్ తెలిపారు. కళాశాలలో అన్ని సౌకర్యాలతో పాటు వివిధ పోటీ పరీక్షల కోసం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్ 7207998971 సంప్రదించాలని కోరారు.

కేసు నమోదు

జన్నారం: బేస్‌క్యాంపు వాచర్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. శనివారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం లోత్రాల బేస్‌క్యాంపులో పనిచేస్తున్న గంగారాం అనే వ్యక్తిని కవ్వాల్ గ్రామానికి చెందిన పోశం అనే వ్యక్తి కొట్టి గాయపరిచినట్లు గంగారాం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టోర్నమెంట్ నిర్వహణ అభినందనీయం



కాసిపేట: మారుమూల గ్రామీణ ప్రాంతంలో జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమని ఎస్సైలు తెలిపారు. శనివారం మండలంలోని ముత్యంపల్లి మైదానంలో షేక్ హైదర్ స్మారకార్థం నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీని కాసిపేట, దేవాపూర్, మందమర్రి, రామకృష్ణాపూర్ ఎస్సైలు గంగారాం, విజయేందర్, చంద్రశేఖర్, అశోక్‌లు నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్కిల్ పోలీసులు నిర్వాహకులతో కలిసి ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. ఈ నెల 26న ఫైనల్ మ్యాచ్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ముత్యంపల్లి ఉప సర్పంచ్ బోయిని తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఎస్సార్‌ఆర్ గార్డెన్స్‌లో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లోని పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, సీఐ కరీముల్లాఖాన్, ఎంఈవో రవీందర్, చెట్ల రమేష్, సత్యసాయి రాష్ట్ర బాధ్యులు పాపిరెడ్డి పాల్గొన్నారు.

వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

తాండూర్: మండల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 'తడిచెత్త, పొడిచెత్త – నిర్వహణ మన బాధ్యత' అనే అంశంపై మండల స్థాయిలో నిర్వహించిన పోటీలకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలో విజేతలుగా నిలిచిన సదరు విద్యార్థులు జిల్లాస్థాయిలో ఈనెల 23న మంచిర్యాలలో జరిగే పోటీలలో పాల్గొంటారని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ ప్రకటించారు.

జాతర కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: మండల కేంద్రంలోని మహేంద్ర కులస్తుల ఆరాధ్య దైవం శ్రీకేతేశ్వర కంకాలమ్మ జాతరకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ ఆవిష్కరించారు. అనంతరం జాతరకు రావాలని ఎమ్మెల్యేను సంఘ సభ్యులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ఆలయ నిర్వాహకులు చిలువేరు నర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు రాజన్న, మల్లయ్య, కనకయ్య, కృష్ణ, కుమార్ ఉన్నారు.

రిటైర్డ్ న్యాయమూర్తిని కలిసిన జిల్లా జడ్జి



మంచిర్యాలక్రైం: హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ చంద్రయ్య శనివారం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా సీసీసీ గెస్ట్ హౌజ్‌లో జిల్లా న్యాయమూర్తి బి.సత్తయ్య, న్యాయమూర్తి మహతి, బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. న్యాయవాదులు తోట మల్లయ్య ఉన్నారు.

వాహనాల తనిఖీ


లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఆంధ్రా కాలనీ ప్రధాన రహదారిపై స్థానిక పోలీసులు శనివారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ కరీముల్లాఖాన్ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు తరలిస్తే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు లక్ష్మణ్, ప్రసాద్ ఉన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా, ప్రజల అభిరుచికి తగినట్లుగా పలు వ్యాపార సంస్థలు కొత్తదనాన్ని అందిస్తున్నాయి. ప్రతిరోజు గజిబిజిగా గడిపే మనుషులు రోజులో కాస్త సేదతీరుతూ, నచ్చిన రకం వంటకాలను తినేందుకు హోటళ్లకు కుటుంబ సభ్యులతో, స్నేహితులతో వెళ్తుంటారు. కొందరు నెలలో, వారంలో ఓసారి అంటూ హోటల్‌కు వెళ్లి నచ్చిన ఫుడ్ ఆర్డర్ ఇస్తుంటారు. రోజురోజుకూ హోటళ్లకు వెళ్లి తినేవారి సంఖ్య పెరుగుతుండడంతో, అందుకు తగినట్లుగానే మంచిర్యాల జిల్లా కేంద్రంలో హైదరాబాద్ వంటి నగరాలను తలపించేలా విభిన్న సెట్టింగ్‌లతో బిర్యాని సెంటర్లు, హోటళ్లు వెలుస్తున్నాయి. దీంతో హోటళ్లకు వచ్చే వారు మరో లోకంలో ఉన్నామా అన్పించేలా సెట్టింగ్‌లు అబ్బురపరుస్తున్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు రెస్టారెంట్లు భోజన ప్రియులను కొత్త అనుభూతితో ఆకట్టుకుంటున్నాయి.

– మంచిర్యాలటౌన్

సండే స్పెషల్





ఆ మజాయే వేరబ్బా!

- భోజన ప్రియులను ఆకర్షిస్తున్న హోటళ్లు
- హోటల్ వాతావరణానికి భిన్నంగా సెట్టింగ్స్
- చిన్నారులు, పెద్దలను ఆకట్టుకుంటున్న వెరైటీలు
- కొత్త లోకాన్ని తలపిస్తున్న రెస్టారెంట్లు

14 రకాల సెట్టింగులతో...

రాష్ట్రంలోనే మొదటిసారిగా జిల్లా కేంద్రంలో 14రకాల సెట్టింగులను వేశారు. మధుర అనుభూతిని అందించేలా సినిమాలకు సెట్టింగులను వేసే వారితో 14 రకాల సెట్టింగులను వేయించారు. గుహలను తలపించేలా కేవ్ సెట్టింగ్, పల్లె వాతావరణం కనిపించేలా, నిజమైనా జురాసిక్ పార్కులో ఉన్నామా అనే భావన కలిగేలా, రాజస్థాన్ రాష్ట్రంలోని సంస్కృతి కనిపించేలా, స్పైడర్‌మ్యాన్ మన పక్కనే ఉన్నాడా అనేలా, ప్రేమికులు, పెళ్లైన జంటలు వారిలోని ప్రేమను ప్రదర్శించుకుంటూ భోజనాన్ని ఆస్వాదించేలా లవ్‌బర్డ్స్ సెట్టింగ్, రాయల్‌సెట్, గ్రీస్‌సెట్, గోవాబీచ్ సెట్, కౌబాయ్ సెట్టింగ్, సినిమా సెట్టింగ్‌ను తలపించేలా చిత్రలహరి, జైలు సెట్టింగ్‌లు ఆ వాతావరణాన్ని ఆనందిస్తూ రుచికరమైన నచ్చిన వంటకాలను తినేలా రూపొందించారు.

చాలా బాగున్నాయి...



ఇప్పటి వరకు అన్ని రకాల సెట్టింగులను ఒకేచోట ఉండడం ఎక్కడా చూడలేదు. మా స్నేహితులు హైదరాబాద్, కరీంనగర్ నుంచి వచ్చి, ఈ సెట్టింగ్‌లను చూసి, రుచికరమైన భోజనాలను చేస్తూ ఆనందిస్తున్నారు. జైలు సెట్టింగ్ చాలా బాగుంది. నిజమైన జైలును తలపించేలా సెట్టింగ్ వేశారు. మిగతా సెట్టింగులు సైతం నిజంగానే ఆ ప్రాంతంలో ఉన్నామా అనే భావనను కలిగిస్తున్నాయి.

ప్రణయ్, మంచిర్యాల

ప్రజల అభిరుచికి తగినట్లు



మా బిర్యాని రెస్టారెంటులో ప్రజలకు కొత్తగా అనిపించేలా ఏదైనా చేయాలనే ఉద్దేశంతో దేశంలోని పలు ప్రాంతాల్లోని రెస్టారెంట్లలో వేసిన సెట్టింగులను పరిశీలించాను. అందులో నాకు నచ్చిన వాటితో పాటు, సెట్టింగ్ వేసే వారిని అడిగి 14 రకాల సెట్టింగులను ఒకే చోట వేయించాము. ప్రజలు వీటిని బాగా ఇష్టపడుతున్నారు. వారికి తగినట్లుగానే నిజమైన అనుభూతిని కల్పించేలా మా ప్రయత్నం చేస్తున్నాం.

సురభి రవికుమార్, సురభి గ్రాండ్ హోటల్ నిర్వాహకులు, మంచిర్యాల

'డీటీ అన్యాయంగా ఇబ్బంది పెడుతున్నాడు'

- మహిళా రేషన్ డీలర్ ఆవేదన

వేమనపల్లి: మండల నయాబ్ తహసీల్దార్ (డీటీ) సంతోష్ అన్యాయంగా తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని నీల్వాయి రేషన్‌షాపు 1 డీలర్ చెన్నూరి పద్మ ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను వచ్చి ఏడాది అవుతుందని, ఇప్పటి వరకు తనను ఎందుకు కలువలేదని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించింది. వేరే జిల్లాల్లో నివాసం ఉంటూ బినామీ పేర్ల మీద రేషన్ షాపులు నడుపుతున్న వారిని పట్టించుకోకుండా తనను ఏ కారణం లేకుండా వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. నెలనెలా 'మామూళ్లు' ఇచ్చిన వారిజోలికి వెళ్లడం లేదని ఆరోపించింది. ఈ నెల 19వ తేదీన రేషన్‌షాపుకు వచ్చి ఎలాంటి కారణం లేకుండానే తనకు మెమో జారీ చేశాడన్నారు. అదే రోజు మిగతా షాపులకు వెళ్లగా డోర్‌లాక్, బినామీ పేర్ల మీద ఉన్న వారు పంపిణీ చేస్తున్న పట్టించుకోలేదని వివరించారు. నిబంధనల ప్రకారం రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నప్పటికీ ఏదో ఒక కారణం పెట్టి మెమోలు జారీ చేస్తూ ఇబ్బంది పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఏదైన విషయం ఉంటే తన భర్తతో మాట్లాడాలని చెబితే అవసరం లేదని, మీటింగ్‌లకు ఇంటి ముందువారిని, ఇంటి వెనుకవారిని పంపు అంటూ వేటకారం ఆడుతున్నారని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపింది.

జిల్లా కేంద్రంలో నాకాబందీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల శివార్లలో పోలీసులు నాకాబందీ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని సున్నం బట్టివాడ సమీపంలోని బైపాస్ రోడ్, ఏసీసీ వద్ద, పాత మంచిర్యాల రహదారి పైన ముగ్గురు ఎస్సైలు, ప్రత్యేక బలగాలతో తనిఖీలు నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరించారు. ఏసీపీ తిరుపతి రెడ్డి, సీఐ నారాయణ్‌నాయక్, ఎస్సైలు రాజేందర్, సుగునాకర్, తైసినొద్దీన్ పాల్గొన్నారు.

జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి

భీమారం: జీవో నం.317 ద్వారా స్థానికత కోల్పోయి ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీరో సర్వీస్‌తో బదిలీల్లో అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షులు సాయింపు శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్యాడర్ విభజనలో తప్పుల కారణంగా న్యాయపోరాటంతో తిరిగి సొంత జిల్లాలకు వచ్చిన ఉద్యోగులకు మొత్తం పీరియడ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పండితుల, పీఈటీల ఉన్నతీకరణ చేపట్టాలని, బదిలీలు, పదోన్నతులు మరింత పారదర్శకంగా జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లోని మూడు డీఏలను విడుదల చేసి జీపీఎఫ్, టీఎస్జీఎల్‌ఐ రుణాలను అనుమతించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెండింగ్ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు జలజ, లక్ష్మి, విఠల్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

'ఎన్నికలు లేక అభివృద్ధి జరగడం లేదు'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అజీమొద్దీన్

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికలు లేక అభివృద్ధి నోచడం లేదని వైఎస్సార్ టీపీ యూత్ జిల్లా అధ్యక్షుడు అజీమొద్దీన్ ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు స్థానిక సింగరేణి హైస్కూల్ మైదానంలో సీఎం కేసీఆర్‌ను గెలిపిస్తే తప్పకుండా మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. గెలిచిన తర్వాత హామీని విస్మరించాలని మండిపడ్డారు. ఇప్పటికైనా ఎన్నికలు జరిపించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కవిరాజ్, జావీద్ పాషా, ఆబీద్ ఉన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన

నెన్నెల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఉమాదేవి మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనతకు లోనవకుండా ఆకుకూరలు, పండ్లు, పాలు, పీచుపదార్థాలు, ఐరన్ లాంటి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటూ లక్ష్యాన్ని ఎంచుకొని అన్ని రంగాల్లో అగ్రస్థానం పొందాలని కోరారు. బాలికల హక్కులు, చట్టాలు, రక్షణ హక్కు, జీవించే హక్కులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ, టీచర్లు ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సబిత, చంద్రకళ, విజయలక్ష్మి, వీన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ స్వరూపారాణి

జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ స్వరూపారాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రసన్న, ఇందిరా, శ్రీలత, చందన, కేజీబీవీ పాఠశాల, ప్రత్యేకాధికారి ఉమా ఉన్నారు.

పార్కు పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: పాత మంచిర్యాలలో రూ.90లక్షలతో చేపడుతున్న పార్కు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం పాత మంచిర్యాలలోని 22 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 5ఎకరాలను బృహత్ పట్టణ ప్రకృతి వనంకు ఇవ్వగా, మిగిలిన 17ఎకరాలు క్రీడాకారులు ఆడుకునేందుకు గ్రౌండ్ కోసం చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ కమీషనర్ ఎన్. బాలకృష్ణ, డీఈ మధుకర్, డిసిసిబి డైరక్టర్ ఎర్రం తిరుపతి, మాజీ కౌన్సిలర్లు బొలిశెట్టి కిషన్, పల్ల రాజన్న పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

సంక్షిప్త వార్తలు

దొనబండలో గడపగడపకూ బీఆర్‌ఎస్



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని దొనబండ గ్రామంలో శనివారం గడపగడపకూ బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. సర్పంచ్ జాడి సత్యం, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీవన్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ ఉన్నారు.

ఎస్సై అభ్యర్థికి స్టడీ మెటీరియల్ అందజేత

భీమారం: ఎస్సై పోస్టుల భర్తీకోసం ఇటీవల జరిగిన దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మండలం సుంకరిపల్లికి చెందిన సెగ్యం రవళికి విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించిన బుక్ మెటీరియల్‌ను శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ భరత్‌రెడ్డి, నాయకులు కోట రాజేష్, సెగ్యం మల్లేశ్, జాడి రమాదేవి, ఇవిడం సురేష్ పాల్గొన్నారు.

నర్సింగాపూర్‌లో జీపీడీపీ సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో శనివారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) కార్యక్రమంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం సర్పంచ్ మట్టపల్లి మంజుల అధ్యక్షతన జరగగా జడ్పీ కో ఆప్షన్ నహీంపాషా, ఉప సర్పంచ్ చలిమెల చంద్రమౌళి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి స్వరూప, ఏఈఓ మౌనిక, ఎఫ్‌బీఓ కవిత ఉన్నారు.

బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడిగా రవీందర్



మందమర్రిరూరల్: బీఆర్‌ఎస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా మూడో జోన్‌కి చెందిన జెంగిలి రవీందర్‌ను నియమిస్తూ శనివారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్‌కు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీలో పలువురి చేరిక

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రికి చెందిన సుమారు వంద కుటుంబాలు టీడీపీ రాష్ట్ర నాయకులు షరీఫా, పట్టణ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ కండువాలు కప్పారు. వాసాల సంపత్, సుధీర్, లక్ష్మి, సుగుణమ్మ, భాగ్య, తిరుపతి, లక్ష్మిరాజం, మధు ఉన్నారు.

ఉచిత హోమియో వైద్య పరీక్షలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం డాక్టర్ కేర్ హోమియోపతి ఆధ్వర్యంలో ఉచితంగా హోమియో వైద్యంతో పాటు, అవసరమైన వారికి మందులు అందించారు. 200లకు పైగా ప్రజలు వైద్య పరీక్షలకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ మల్లేశ్, రజిత, విజయ్ కుమార్, గీత, వెంకట్, రమణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఆత్మీయ సమ్మేళనం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లె దామోదర్‌రెడ్డి, ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ తిరుపతి, రాష్ట్ర వికాస సమితి ఉపాధ్యక్షుడు విజయానంద్, సోషల్ మీడియా కన్వీనర్ రవీందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ బాపురెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

మంచిర్యాలటౌన్: వాసవిక్లబ్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట శనివారం అన్నదానం చేపట్టారు. క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు హరీష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సతీశ్, వంశీకృష్ణ, అధ్యక్షుడు ప్రవీణ్, కోశాధికారి మహేశ్ పాల్గొన్నారు.

పద్మశాలీ వధూవరుల పరిచయ వేదిక

జన్నారం: ఈ నెల 29న నస్పూర్‌లో సింగరేణి గార్డెన్‌లో పద్మశాలి కులస్తుల వధూవరుల పరిచయ వేదిక ఏర్పాటు చేయనున్నట్లు పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం తెలిపారు. సంఘం జిల్లా, మండల నాయకులు రవీందర్, సత్యనారాయణ, లక్ష్మణ్, రాజలింగు ఉన్నారు.

సహకార సంఘం కార్యవర్గం..

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎనుకున్నారు. అధ్యక్షుడిగా నూనె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మహంకాళి వేణుగోపాల్, కార్యదర్శిగా అటికేటి రవీందర్, కార్యవర్గ సభ్యులుగా నూనె రామ్మూర్తి, నూనె సతీష్, పోతరవేని రాజయ్య, మహంకాళి సంతోష్‌కుమార్, ఓదెలు, శంకర్‌లను ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వాహకులు నితిన్‌కుమార్ తెలిపారు.

నేడు నేతకాని ఆత్మీయ సమ్మేళనం

శ్రీరాంపూర్: నేతకాని మహా ఆత్మీయ సమ్మేళనం నేడు రామగుండంలో నిర్వహిస్తున్నట్లు సమన్వయ కమిటీ నాయకులు తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆర్కే నేతకాని, సమన్వయ కమిటీ చైర్మన్ దుర్గం రాజేశ్ మాట్లాడారు.

బంగారం అప్పగింత



దండేపల్లి: మండలంలోని చింతపల్లిలో గోపాల్ పిండిగిర్నికి నాయకపుగూడెంకు చెందిన పోశం బియ్యం మరపట్టించేందుకు తెచ్చాడు. రూ.20వేల విలువ చేసే బంగారు దిమ్మలు కనిపించడంతో యజమాని సదరు వ్యక్తి కి అప్పగించాడు.

ఉచితంగా కంటి పరీక్షలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లి గ్రామంలో వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు రఘునాథరావు మాట్లాడారు. గ్రామంలో 350 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. త్వరలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్స ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



అద్దాలు అందిస్తున్న రఘునాథరావు

కోడి కోసం పోతే చువ్వ గుచ్చింది

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పద్మశాలి కాలనీ హనుమాన్ నగర్‌కు చెందిన చికెన్ సెంటర్ నిర్వాహకుడు గురువుల వెంకటేశ్ శనివారం కోడిని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో కడుపులో బలంగా ఇనుపచువ్వ దిగింది. దీంతో స్థానికులు వెంటనే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రమాదం తప్పింది.